సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం । 23 । అక్టోబర్ । 2023

విజయీభవ..

చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా ఆనందంగా జరుపుకొనే పండుగ దసరా. జగత్తుకు మూలం.. త్రిమూర్తులకు శక్తిప్రదాత.. త్రిలోకేశ్వరి సకలాభీష్ట ప్రదాయిని దుర్గామాత దుష్ట శిక్షణ చేసిన రోజు విజయదశమి. చేసే ప్రతిపనిలోనూ విజయం సాధించాలని కోరుకుంటూ శమీవృక్షాన్ని పూజించడం సంప్రదాయం. ఇలాంటి దసరా రోజు యంత్ర, వాహన, పనిముట్లకు పూజలు చేయడం ఆనవాయితీ. నేడు విజయదశమి..





బతుకమ్మ ఘాట్ వద్ద వేడుకల్లో పట్టణ వాసులు



బతుకమ్మతో మహిళ



వాయినం ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు



రాళ్లబావి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మ నిమజ్జనం చేస్తున్న మహిళలు



పట్టణవాసుల అల్పాహారం

ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ..

- మానేరు తీరాన పూలసింగిడి
- జిల్లాలో అంబరాన్నంటిని 'సద్దుల' సంబురాలు
- జనసంద్రమైన బతుకమ్మ ఘాట్

సిరిసిల్లటౌన్: మానేరు తీరాన పూలసింగిడి కనువిందు చేసింది. తీరొక్క పువ్వుల కలబోత అయిన బతుకమ్మ పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మ సంబరాలు జిల్లా కేంద్రంలో అంబరాన్ని తాకాయి. సంప్రదాయ వస్త్రధారణలతో బతుకమ్మలను తీసుకువచ్చిన మహిళలు ఆట పాటలతో ఆనందించారు. ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రం సిరిసిల్లలోని వీధులు విరిపూలతో నిండిపోయాయి. మహిళలు, పిల్లల హడావిడితో పండుగశోభను రంగరించుకుని రహదారులన్నీ పూల వనాన్ని తలపించాయి. పెద్ద వయసు మహిళలతో పాటు యువతులు, విద్యార్థులు తమదైన శైలిలో బతుకమ్మ వేడుకల్లో భాగం పంచుకున్నారు. కోలాటాలు, దాండియా ఆటలతో బతుకమ్మ పాటలపై చిందేశారు. 'సద్దుల బతుకమ్మ' పండుగకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. ముత్తైదువులు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో ఆనందకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ అన్సార్ వేడుకలను పర్యవేక్షించారు. ఘాట్ వద్ద సుమారు 20 వేల మంది వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల నిమజ్జనానికి పట్టణం నలువైపులా అనుకూలమైన స్థలాలను మున్సిపల్ వారు ఎంపిక చేసి రూ.28.50లక్షలతో మౌలిక వసతులు కల్పించారు. బతుకమ్మఘాట్‌తో పాటు ప్రేమ్‌నగర్, ఈదుల చెరువు, కొత్తచెరువు, దామెరకుంట తదితర ప్రాంతాల్లో నిమజ్జనం పాయింట్లు ఏర్పాట్లు చేశారు.



కోనరావుపేటలో తుల ఉమ, మహిళలు



బతుకమ్మతో ఎల్లారెడ్డిపేట ఎంపీపీ రేణుక



బతుకమ్మ ఆడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మహిళలు



బతుకమ్మతో మహిళ



వేడుకల్లో వినోద్‌కుమార్ దంపతులు, తదితరులు



సిరిసిల్ల విద్యానగర్‌లో..



వైశ్య భవన్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మలతో వస్తున్న మహిళలు



జిల్లా కేంద్రంలో బతుకమ్మ వేడుకలు



బోయినపల్లిలో..



బరిలో బండి.. ఈటల.. అర్వింద్

- ఉమ్మడి జిల్లా నుంచే సీఎం అభ్యర్థులు..!
- బీసీ సీఎం నినాదంతో అనుచరుల్లో ఉత్సాహం
- తొమ్మిది స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన కమలం
- హుజూరాబాద్, గజ్వేల్‌లో రెండుచోట్ల బరిలో రాజేందర్
- 19 ఏళ్ల తరువాత రెండు స్థానాలకు కరీంనగర్ నేత పోటీ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ బరిలో నిలిచే బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 స్థానాలు ఉండగా.. తొమ్మిది స్థానాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. తొలిజాబితా అభ్యర్థులకు శనివారం రాత్రే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఫోన్ చేసి పోటీకి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినా అధికారికంగా ప్రకటించేవరకూ ఈ విషయాన్ని ఎవరూ వెల్లడించలేదు. 2018 ఎన్నికలతో పోల్చితే నాయకుల విషయంలో స్పష్టమైన తేడా కనిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు స్థానాల్లో ప్రాతినిధ్యం కరవవడం.. లేదా పొత్తులతో సాగే చరిత్ర ఉన్న బీజేపీ తాజాగా బలోపేతమైంది. ప్రస్తుతం ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు, ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే, అలాగే మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ, మాజీ ఎమ్మెల్యే బరిలో ఉండటం గమనార్హం.

పార్టీ ప్రకటించింది వీరినే..

- కోరుట్లకు ధర్మపురి అరవింద్, జగిత్యాలకు భోగ శ్రావణి, ధర్మపురికి ఎస్.కుమార్, చొప్పదండికి బొడిగె శోభ, రామగుండంకు కందుల సంధ్యారాణి, సిరిసిల్లకు రాణీ రుద్రమదేవి, కరీంనగర్‌కు బండి సంజయ్, మానకొండూరుకు ఆరెపల్లి మోహన్, హుజూరాబాద్‌కు ఈటల రాజేందర్ పేర్లను పార్టీ ప్రకటించింది. ఈటల తన సొంత నియోజకవర్గమైన హుజూరాబాద్‌తోపాటు ప్రస్తుతం సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నుంచి కూడా బరిలోకి దిగనుండటం విశేషం. జిల్లా చరిత్రలో కేసీఆర్ తరువాత రెండుసార్లు బరిలోకి దిగుతున్న ఏకైక నాయకుడు ఈటల కావడం గమనార్హం. 2004లో కరీంనగర్ ఎంపీ, సిద్దిపేట అసెంబ్లీకి పోటీ చేసిన కేసీఆర్.. రెండుచోట్లా విజయం సాధించారు. తరువాత సిద్దిపేట స్థానానికి రాజీనామా చేశారు. దాదాపు 19 ఏళ్ల తరువాత కరీంనగర్ నుంచి రెండుచోట్ల అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుండటం విశేషం.

ముగ్గురు సీఎం అభ్యర్థులు

- బీసీ సీఎం నినాదంతో బీజేపీ ఈసారి ఎన్నికల బరిలోకి దిగే యోచనలో ఉంది. పార్టీలో బీసీ సీఎం అభ్యర్థి ప్రతిపాదన రాగానే.. ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల మధ్య పోటీ మొదలైంది. మరోవైపు తాను ఏమాత్రం తక్కువా..? అన్నట్లు కోరుట్ల అసెంబ్లీ నుంచి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ రంగంలోకి దిగారు.
- బండి సంజయ్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గంగుల కమలాకర్ చేతిలో పరాజయం పాలయ్యారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా విజయం సాధించారు. ఆ తరువాత రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టి బీజేపీకి ఊపు తెచ్చారు. దుబ్బాక, జీహెచ్‌ఎంసీ, హుజూరాబాద్ ఎన్నికల్లో బీజేపీని విజయతీరా లకు చేర్చారు. 8శాతం ఉన్న ఓటుబ్యాంకును అమాంతం పెంచారు.
- తెలంగాణ ఉద్యమ పార్టీ బీఆర్‌ఎస్ వేదికగా రాజకీయ ఆరంగేట్రం చేసిన ఈటల రాజేందర్ 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021లో వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా, శాసనసభాపక్ష నేతగా పనిచేసిన అనుభవంతో రాజేందర్ సైతం పార్టీ సీఎం అభ్యర్థి అవుతారని ఆయన అనుచరులు చెప్పుకుంటున్నారు.
- ఎలాగైనా అసెంబ్లీ బరిలో ఉండాలన్న పట్టుదలతో కొంత కాలంగా ధర్మపురి అర్వింద్ కోరుట్లలో చాపకింద నీరులా పనిచేసుకుంటూ వెళ్తున్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు కుమారుడు సంజయ్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఉన్నారు. సంజయ్ కొత్త అభ్యర్థి కావడం, తాను ఎంపీగా ఉన్న నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోనే కోరుట్ల ఉండటం, తన అమ్మమ్మ ఊరు కావడం, సొంత సామాజికవర్గం సహకారం తదితరాల లెక్కలతో అర్వింద్ ఈసారి కోరుట్లపై కన్నేశారు.

పోటీకి బండి, ఎస్.కుమార్ అనాసక్తి..

కేంద్రమంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి వస్తుందని ప్రచారం జరుగుతున్న క్రమంలో అసెంబ్లీకి పోటీ చేయాలని ఆదేశాలు రావడంపై బండి సంజయ్.. అసలు తనకు మాట మాత్రమైనా చెప్పకుండా ధర్మపురిలో పోటీ చేయాలని చెప్పడంపై ఎస్.కుమార్ అసంతృప్తితో ఉన్నారని సమాచారం.

పేరు: బండి సంజయ్



జన్మదినం: 11-07-1971
విద్యార్హతలు: గ్రాడ్యుయేషన్
స్వగ్రామం: కరీంనగర్
అనుభవం: 2005, 2014లో కార్పొరేటర్, 2014, 2018 ఎమ్మెల్యే స్థానానికి పోటీ, 2019 ఎంపీగా విజయం.

- అదనపు సమాచారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి, ప్రస్తుతం జాతీయ ప్రధాన కార్యదర్శి

సామాజిక వర్గం: మున్నూరుకాపు

పేరు: ధర్మపురి అర్వింద్



జన్మదినం: 25-08-1976
విద్యార్హతలు: ఎంఏ.పొలిటికల్ సైన్స్
స్వగ్రామం: నిజామాబాద్
అనుభవం: 2019 నిజామాబాద్ ఎంపీ,

- అదనపు సమాచారం: కేంద్ర వాణిజ్య స్టాండింగ్ కమిటీ సభ్యులు

సామాజికవర్గం: మున్నూరుకాపు

పేరు: బొడిగె శోభ



జన్మదినం: 1972
విద్యార్హతలు: పదవ తరగతి
స్వగ్రామం:వెంకటేశ్వర్లపల్లె, సైదాపూర్ మండలం
అనుభవం: 2001 శంకరపట్నం జెడ్పీటీసీ, 2014లో ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్), 2018 ఎమ్మెల్యేగా ఓటమి.

- అదనపు సమాచారం: చొప్పదండి బీజేపీ ఇన్‌చార్జి

సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)

పేరు: ఈటల రాజేందర్



జన్మదినం: 20-03-1964
విద్యార్హతలు: పీజీ (ఉస్మానియా)
స్వగ్రామం: కమలాపూర్ (ప్రస్తుతం హన్మకొండ జిల్లా)
అనుభవం: ఏడుసార్లు ఎమ్మెల్యే,రెండుసార్లు మంత్రి, శాసనసభ పక్షనేత

- అదనపు సమాచారం: 2021లో బీజేపీలో చేరిక. చేరికల కమిటీ చైర్మన్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్.

సామాజిక వర్గం: ముదిరాజ్

పేరు: ఎస్.కుమార్



జన్మదినం: 10-10-1966
విద్యార్హతలు: ఎంసీజే, ఎల్ఎల్ఎం (ఉస్మానియా)
స్వగ్రామం: గోదావరిఖని
అనుభవం: రామగుండం మున్సిపాలిటీ చైర్మన్ 2004, 2009 ధర్మపురి ఎమ్మెల్యే స్థానానికి, 2019 పెద్దపల్లి ఎంపీ స్థానానికి పోటీ చేసిన అనుభవం

- అదనపు సమాచారం: జర్నలిస్టుగా అనేక అవార్డులు, బీజేపీ జాతీయస్థాయిలో పలు పదవుల నిర్వహణ.

సామాజికవర్గం: ఎస్సీ (మాల)

పేరు: ఆరెపల్లి మోహన్



జన్మదినం: 6-6-1955
విద్యార్హతలు:ఎంకామ్,ఎల్ఎల్‌బీ
స్వగ్రామం: మానకొండూరు
అనుభవం: సర్పంచి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, విప్. 2009లో మానకొండూరు ఎమ్మె ల్యే, 2014, 2018లో అక్కడ నుంచే పరాజయం.

- అదనపు సమాచారం: 2019లో బీఆర్‌ఎస్‌లో చేరిక, టికెట్ ఆశించి భంగపడి కమలం గూటికి.

సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)

రాజన్న సేవలో కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ సెషన్స్ జడ్జి


జడ్జి శ్రీవాణికి ప్రసాదం అందజేస్తున్న శ్రీరాములు

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ సెషన్స్ జడ్జి శ్రీవాణి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనంతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకుడు శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్ ఉన్నారు.

సిరిసిల్ల బీజేపీ టికెట్‌పై సమీక్షించాలి


లగిశెట్టి శ్రీనివాస్

సిరిసిల్ల: సిరిసిల్ల బీజేపీ టికెట్‌పై పార్టీ అధిష్టానం సమీక్షించాలని ఈపార్టీ నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్ ఆదివారం కోరారు. సిరిసిల్ల టికెట్‌ను స్థానికులకు కేటాయిస్తామని మాట ఇచ్చిన బీజేపీ నాయకులు ఇప్పుడు స్థానికేతరులకు కేటాయించడం పట్ల జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా పద్మశాలీ సామాజిక వర్గానికి కేటాయించాలని కోరారు. తనకు టికెట్ రాక పోవడంతో కన్నీరు పెట్టినట్లు జరిగిన ప్రచారాన్ని ఖండించారు.

‘అమ్మ’ సేవలో తరిస్తూ..

- వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు
- జిల్లా కేంద్రంలో పెరుగుతున్న దుర్గామాత మండపాలు
- సుమారు 21 చోట్ల ప్రతిష్ఠిత విగ్రహాలకు పూజలు


జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ మండపంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సిరిసిల్లకల్చరల్: సర్వ దేవతల స్వరూపమై సమస్త శక్తి స్వరూపిణి. ఆ తల్లి కరుణిస్తే కురిసేదంతా అమృత వర్షమే.. ఆ అమ్మ కటాక్షిస్తే ఇంటింటా సిరిసంపదలే. లోక రక్షణకు పార్వతి, సరస్వతి, లక్ష్మి రూపాల్లో అవతరించింది. లోక కంటకులైన రాక్షసులను తన విశేషమైన శక్తి యుక్తులతో సంహరించిందీ కాలంలోనే అని పురాణాలు చెప్తున్నాయి. అందుకే ఈ శరత్కాలంలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సమయంలో చేసే ఆరాధనలు ఏడాదంతా చేసే పూజలకు సమానమైన ఫలితాలిస్తాయని భావిస్తారు. ఈ కారణంగా అమ్మ ఆరాధకుల సంఖ్య జిల్లా కేంద్రంలో ఏటేటా పెరుగుతూ వస్తోంది.

జిల్లా కేంద్రంలో..

జిల్లా కేంద్రంలో ప్రధానంగా కార్మికులు అధికంగా నివసిస్తుంటారు. వీరిలో చాలా మంది కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం మహారాష్ట్ర, సూరత్, గుజరాత్ లాంటి ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజలతో మమేకమైన వాళ్లు, అక్కడి సంప్రదాయాలను జీర్ణించుకుని దశాబ్దాల క్రితం అంబా భవాని మాతను ప్రతిష్ఠించి ఆరాధించే సంప్రదాయాన్ని ప్రారంభించారు. తొలుత వెంకంపేటలో ఒకే మండపం ఉండగా క్రమంగా వీటి సంఖ్య పెరుగుతూ వస్తోంది. కార్మిక ప్రాంతాలైన నెహ్రూనగర్, బీవైనగర్, మార్కెట్ ఏరియా, సుభాష్‌నగర్, సుందరయ్యనగర్ తదితర ప్రాంతాల్లో దేవీ మండపాలను నిర్మించి అమ్మ ఆరాధనలో జనం తరిస్తున్నారు. ఈ ఏడాది ఈ సంఖ్య 21 ప్రాంతాలకు విస్తరించడం విశేషం.

నవ రాత్రులు.. వివిధ రూపాల్లో..

దేవీ నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులు భక్తి శ్రద్ధలతో కొనసాగుతాయి. రోజుకో రూపంలో తల్లిని ఆరాధించడం ఆనవాయితీగా వస్తోంది. మార్కండేయ పురాణం ప్రకారం చాముండి, నంద, దమయంతి, శాకాంబరి, దుర్గ, మాతంగి, భ్రామరి అనే రూపాల్లో కొలుస్తారు.తత్వ శాస్త్ర గ్రంథాలను అనుసరించి శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధి ధాత్రి రూపాల్లో ఆరాధించడం సంప్రదాయం. పురాణ సంప్రదాయం ప్రకారం లలితా త్రిపురసుందరి, బాలా త్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, సరస్వతి, దుర్గ, మహాలక్ష్మి, మహిషాసుర మర్ధిని, మహాకాళి, రాజరాజేశ్వరి రూపాల్లో విశేష అర్చనలు జరుపుతారు.

నిత్య పూజలు.. నిత్యాన్న దానాలు

దేవీ మండపాల వద్ద నిర్వాహకులు, భవానీ దీక్షాపరులు, స్థానిక మహిళలు నిరంతర పూజలు చేస్తున్నారు. నీరాజనాలు, మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణలు గావిస్తున్నారు. చండీ హోమాలు ప్రత్యేకంగా జరుపుతున్నారు.

అమ్మ చలవే ఆలయానికి ఆరంభం



ఏటా దేవీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు జరపడం ఆనవాయితీగా పాటిస్తున్నాం. జిల్లాలో ఇది మూడోది. 29 ఏళ్లుగా నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నాం. ప్రతి సారీ దీక్షలో ఉంటా. 19 ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణానికి సంకల్పించాం. అమ్మ చలవ, మా సంకల్పం కారణంగా ఆలయాన్ని పూర్తి స్థాయిలో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం.

– చిలుక నారాయణ, మాజీ కౌన్సిలర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

తల్లి దయే ఈ పునర్జన్మ



నెహ్రూనగర్‌లో ఉత్సవాలు ప్రారంభమైన ఏడేళ్లకు నేను దీక్ష తీసుకున్న. అప్పటి నుంచి క్రమం తప్పకుండా చేస్తున్న 22వ దీక్ష ఇది. 41 రోజుల పాటు కఠిన నియమాలు పాటిస్తూ అమ్మవారి సేవలోనే తరిస్తున్నా. సంక్లిష్టమైన స్థితి నుంచి బయటపడ్డ నాకు ఇది అమ్మ ప్రసాదించిన పునర్జన్మగా భావిస్తున్నా.

– ద్యావనపల్లి గోవర్ధన్

దేవీ కరుణతో అంతా శుభమే



అమ్మవారి అనుగ్రహం ఉంటే అన్నీ సమకూరుతాయి. కొన్నేళ్లుగా భవానీ దీక్షలో కొనసాగుతున్నా. సంతృప్తికరమైన జీవనానికి దీక్షలు చాలా ఉపయోగపడుతున్నాయి. ఇది నా స్వానుభవం.

– పోలు నారాయణ, భవానీ దీక్షదారుడు

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే..



లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో వ్యాపారులందరం కలిసి దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని తొమ్మిదేళ్ల క్రితం సంకల్పించాం. తొలిసారి 12 మంది దీక్షతో మండపాన్ని నిర్మించి ఉత్సవాలు కొనసాగిస్తున్నాం. ఆ తల్లి కటాక్షంతోనే అందరం హాయిగా వ్యాపార, వ్యవహారాలు సాగిస్తున్నాం.

– వాసాల లక్ష్మీనారాయణ, దీక్షాదారుడు

మహాగౌరి రూపంలో అమ్మవారు



వేములవాడ: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాజన్న ఆలయంలో అమ్మవారు మహాగౌరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

పురవీధుల్లో స్వామివారి విహారింపు


శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు

సిరిసిల్లటౌన్: శ్రీశాల పురవీధుల్లో దేవదేవుడు ఆది శేషుని వాహనంపై విహరించారు. భక్తుల ఆటపాటలు, మంగళ వాయిద్యాల నడుమ ఆదివారం సిరిసిల్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రెండోరోజు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఉదయం 8గంటల నుంచి ఆలయంలో రక్షాబంధనము, రుత్విక్‌వరణము, అంకురారోపణము, ధ్వజారోహనము రాత్రి 7గంటలకు భేరిపూజ, అగ్నిప్రతిష్ట దేవతాహ్వానము, బలిహరణము నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సహితంగా వేంకటేశ్వరస్వామిని శేషవాహనంపై ఊరేగించారు. ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, తీగల శేఖర్‌గౌడ్, ఈవో మారుతిరావు, ఏఈవోలు రవీందర్, ప్రభాకర్, ప్రధాన అర్చకస్వామి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల చందనకు సత్కారం


చందనను సన్మానిస్తున్న కవులు

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన కవి, పరిశోధకురాలు, ఉపాధ్యాయిని సిరిసిల్ల చందనను ఆదివారం ఆమె స్వగృహంలో మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి ప్రతినిధులు సత్కరించారు. పాఠ్యపుస్తకాల రచయితల్లో ఒకరిగా భాషా సేవ చేస్తున్న ఆమెను ఈ సందర్భంగా అభినందించారు. హిందీలో పరిశోధన పత్రాన్ని సమర్పించి డాక్టరేట్ పొందడం, బాల సాహిత్యం విషయంలో ఎనలేని సేవలు అందిస్తున్న చందనను అభినందించారు. కార్యక్రమంలో మారసం కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, ఈడెపు సౌమ్య, సుంక ధరణి, డాక్టర్ జనపాల శంకరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి


పార్టీలో చేరినవారితో లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తుందని వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. కథలాపూర్ మండలం దూలూరుకు చెందిన 50 మంది యువకులు, కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి యువకులు ఆదివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ చైర్మన్ సౌజన్య, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మిట్టపల్లి లక్ష్మి, ఎంపీటీసీ లక్ష్మి, గ్రామ అధ్యక్షుడు జూపాక మహేశ్, నాయకులు మిర్యాల వెంకటేశ్వరరావు, మేడిపల్లి రాజిరెడ్డి పాల్గొన్నారు.

కండువాలు మారుతున్నాయ్

జంగ్ తెలంగాణ

- రెండు పార్టీల్లో జోరుగా చేరికలు
- మొదటి దఫాలో అభ్యర్థిని ప్రకటించని బీజేపీ
- అయోమయంలో కేడర్

వేములవాడరూరల్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు జోరుగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఒకరిపై ఒకరు పోటీగా గ్రామాల్లో తిరుగుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించి, కుల సంఘాలను కలుస్తున్నారు. ఇతర పార్టీల నుంచి చేరికలపై కూడా ప్రధాన దృష్టి పెట్టిన నాయకులు పార్టీలో యువతను, ఓటర్లను చేర్చుకుంటున్నారు. కాగా, కొన్ని గ్రామాల్లో పార్టీలో చేరిన నాయకులు మరికొద్ది రోజులకు మరో పార్టీ కండువాలు కప్పుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో ప్రధానంగా చేరికలు జోరందుకున్నప్పటికీ బీజేపీలో మొదటి దఫా 52 మందిని ప్రకటించినా వేములవాడ అభ్యర్థిని మాత్రం ఇప్పటి వరకు ప్రకటించకపోవడంతో ఆ పార్టీలోని గ్రామస్థాయి నాయకులు మౌనంగా ఉండిపోతున్నారు. ఇదే అదనుగా భావించిన రెండు పార్టీల నాయకులు బీజేపీ నుంచి మండలస్థాయి నాయకుల వరకు తమ పార్టీలో చేర్చుకుంటున్నారు. ఇందుకు ఉదాహరణ ఇటీవల వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు బండ మల్లేశం యాదవ్, గోపు బాలరాజు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే గ్రామాల్లో యువత ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేరుతున్నారు. బీజేపీలో చెన్నమనేని వికాస్‌రావు, తుల ఉమ మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో అధిష్టానం మొదటి దఫాలో అభ్యర్థిని ప్రకటించలేదు. ఏదిఏమైనా వేములవాడ పరిధిలో బీజేపీకి గ్రామస్థాయిలో బలం ఉన్నా అభ్యర్థుల ఎంపికలో రోజురోజుకు ఆలస్యం కావడం ఆ పార్టీకి కొంత నష్టం ఏర్పడనున్నదని పలువురు చర్చించుకుంటున్నారు.

సేవ చేసే భాగ్యం కల్పించండి


ప్రచారం నిర్వహిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: ‘నేను మీ పేద బిడ్డను.. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి.. మీకు సేవచేసే భాగ్యం కల్పించండి’ అని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఓట్లు అభ్యర్థించారు. ఆదివారం వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ రెడ్డి కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, తాను నాలుగుసార్లు ఓడినా ప్రజల మధ్య ఉండి సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. ఒక్కసారి ప్రజలు ఆలోచించి సేవ చేసే భాగ్యం కల్పించాలని, చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేశ్, కిరణ్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

కాలువలో పడి యువకుడు మృతి

హుజూరాబాద్‌రూరల్: పండుగకు బంధువుల ఇంటికి వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు కాలువలో పడిమృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్నపాపయ్యపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన వరాల నరేందర్‌రెడ్డి(23) దసరా పండగకు చిన్నపాపయ్యపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తోటి స్నేహితులతో కలిసి సమీపంలోని కాకతీయ కాలువలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీళ్లలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగిపోతుండగా.. స్నేహితులు గమనించి ఒడ్డుకు చేర్చారు. వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

జమ్మికుంట(హుజూరాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలకేంద్రానికి చెందిన పెద్ది సురేశ్ (27) పట్టణంలోని ఓ మిల్లులో హమాలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి పని ముగించుకొని బైక్‌పై వెళ్తుండగా హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద కొత్తపల్లికి చెందిన వంశీ సురేశ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సురేశ్ తలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చి కిత్స పొందుతూ ఆ దివారం మృతి చెందాడు. మృతుడికి భార్య మ మత, కూతురు ఉంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం చూపుతున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర గ్రామానికి చెందిన తాళ్లపల్లి పెద్ద ఎల్లయ్య ఎన్నికల నియమావళి ఉల్లంఘించి మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎల్లయ్య అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అతడి ఇంట్లో సిబ్బంది సోదాలు నిర్వహించారు. ఇంట్లో నిల్వ చేసిన రూ.10 వేల విలువగల బీర్ సీసాలు, ఇతర మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఎల్లయ్యపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనుమతి లేకుండా ఇళ్లలో మద్యం నిల్వ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దాడిలో సిబ్బంది కిశోర్‌కుమార్, మల్లేశ్, అమృతరెడ్డి, సర్దార్, అలీ, కృష్ణకాంత్, రాజు పాల్గొన్నారు.

పండుగపూట విషాదం

- వ్యాన్ ఢీకొని యువకుడి దుర్మరణం


అనిల్ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బతుకమ్మ పండగ రోజు వారింట విషాదం నెలకొంది.. రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామశివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాలు.. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన పిస్క అనిల్(27), పిట్ల ఆంజనేయులు (25) సిద్దిపేట నుంచి సిరిసిల్లకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఇదే సమయంలో సిరిసిల్ల నుంచి సిద్దిపేట వైపు వేగంగా వెళుతున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో అనిల్ అక్కడికక్కడే మృతిచెందగా, ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. అనిల్ గజ్వేల్‌లోని ఓ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. అతడి తండ్రి నర్సయ్య రెండేళ్లక్రితం చనిపోగా తల్లి లక్ష్మి, ముగ్గురు అక్కలు ఉన్నారు. క్షతగాత్రుడు ఆంజనేయులును సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బతుకమ్మ పండగపూట ప్రమాద జరగడంతో ఇరువురి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

రూ.2.50 లక్షలు సీజ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల శివారులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులో శనివారం రాత్రి 2 గంటలకు ఎలక్షన్ స్పెషల్‌టీమ్ అధికారులు రూ.2.50 లక్షల నగదు సీజ్‌చేశారు. సిరిసిల్లకు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు తన కారులో వెళ్తుండగా వాహనాన్ని తనిఖీ చేయగా ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న 2 లక్షల 50 వేల రూపాయలను గుర్తించి సీజ్‌చేశారు.